


**కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం పోరాటం**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 07 జులై , 2026 | పేజీలు : 5

# పేదల సంక్షేమమే లక్ష్యం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
### మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు
### 261 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న మొత్తం 261 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట సమయంలో అందుతున్న ఈ ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు గొప్ప ఊరటనిస్తోందని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా చేరేలా తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**మధ్యవర్తులను నమ్మొద్దు.. ఒక్క రూపాయి ఇవ్వొద్దు!**

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకంలోనూ ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నమ్మవద్దు. మధ్యవర్తుల బారిన పడి మోసపోవద్దు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం కట్టుబడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హుడికి చేరవేయడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ వాణి భరద్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మంగ సత్యనారాయణ, యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్లు, ముక్కెర్ల మల్లేష్, బూడిద మధు,నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని,అదేవిధంగా ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను కూడా జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు.వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 56, ఇతర శాఖలకు 40 చొప్పున మొత్తం 96 ఫిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,గృహనిర్మాణ శాఖ పిడి రాజకుమార్,డిఆర్ఓ దశరథతో పాటు జిల్లా అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## వికసిత్ భారత్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భారత్ అభివృద్ధి పథంలో నడవాలంటే యువత భాగస్వామ్యం అవసరమని ఎంజియు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అన్నారు.మైభారత్ సంస్థ చేపట్టిన'వికసిత్ భారత్ విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని సేవా కార్యక్రమాలలో నిమగ్నమవ్వాలని సూచించారు.మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములై దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మారం వెంకట రమణారెడ్డి,జిల్లా యూత్ ఆఫీసర్ గౌతమ్ రెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కట్ట కిరణ్ మై,డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.





**నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఉచిత పత్తి విత్తనాలకు రైతులు తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం మండల పరిధిలోని పోలేపల్లి రైతు వేదిక వద్ద వ్యవ సాయ అధికారులు రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేయడంతో ఒక్క సారిగా రైతులు విత్తనాల కోసం రావడంతో గందరగోళం నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున రైతులు రావడంతో అధికారులు కొద్ది సేపు విత్తనాలను ఇవ్వడం ఆపివేసి, రైతులను క్యూలో ఉండాలని సూచించారు. అనంతరం గ్రామాల వారిగా ఏఈవోలు విత్తనాలను అందజేయాలని ఏడిఎస్ శ్రీలత, ఏవో లక్పతి నాయక్‌ను కోరడంతో రైతులకు అందరికి పత్తి విత్తనాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. -ప్రజాపక్షం/చందంపేట**



## ఎమ్మెల్యే మందుల సామేల్ జోలికొస్తే సహించేది లేదు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** తుంగతుర్తి నియోజక వర్గంలోని అన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (టిపిసిసి) అధ్యక్షులు, బొమ్మ మహేష్ కుమార్ అధికారికంగా ప్రకటించిన అనంతరం పార్టీకి వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహించడం అత్యంత భాధాకరమైన విషయమని జై భీమ్ జై బాపు జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్ జీడి వీరస్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెల్పుల రమేష్‌లు అన్నారు. ఎస్‌సి రిజర్వు నియోజక వర్గమైన తుంగతుర్తిలో చరిత్రలో ఎన్నడూ లేని మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఆధార రహిత ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి కొరపిడతల అవిలయ్య, కుంకుడుపాల రవీందర్, జీడి భాస్కర్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, సత్యం, సాయి పాల్గొన్నారు.

## జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ జూనోసిడ్ సందర్భంగా పట్టణంలోని పశువైద్య శాలలో 210 కుక్కలకు ఉచిత రేబీస్ టీకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల ద్వారా మనుషులకు వ్యాధులు సోకకుండా రేబీస్ టీకాలు వేయించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కిరణ్‌కుమార్, డాక్టర్ వేణుగోపాల రావు, వైద్యసిబ్బంది యం. రాజు పాల్గొన్నారు.

## బైండోవర్‌ను అతిక్రమించిన వ్యక్తికి 70వేల జరిమానా

**ప్రజాపక్షం/పాలకవీడు:** మండల పరిధిలోని యల్లారం గ్రామానికి చెందిన షేక్ హకీం అను ఆతడు కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన వివాహితను వేధిస్తుండగా అతనిపై ఎస్ఐ కోటేష్ కేసు నమోదు చేసి సత్ప్రవర్తన నిమిత్తం పాలకీడు తహసిల్దార్ ముందు బైండో ఆవర్ చేయనైనది. అయిన అతడిలో ఎలాంటి మార్పు రాకుండా మరలా అదే వివాహితతో అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసి జైలుకు పంపనైనది. సత్ ప్రవర్తన నిమయం ను అతిక్రమించిగా ఎస్ఐ పంపిన రిపోర్టు ఆదారంగా బైండో ఓవర్‌ను అతిక్రమించినందుకు షేక్ హకీంకు 70వేల జరిమాన విధించి కట్టించనైన్నట్లు ఎస్ఐ తెలిపారు.



## ప్రతి విద్యార్థి తల్లి పేరుతో మొక్క నాటాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, హరితహారం విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జిసి), జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) 2026 జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతా భావం పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో కనీసం 10 పండ్ల మొక్కలు, ఇతర మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరణక్షకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ జాతీయ స్థాయి పర్యావరణ పోటీలో విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ పౌరులు మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని తమ ఫోటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, జడ్‌పి సిఇఓ శిరీష, డిఈఓ అశోక్, ఎన్‌జిసి జిల్లా కోఆర్డినేటర్ లామ్ దేవరాజు, హౌసింగ్ పిడి సిద్ధార్థ, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు నకిలీ విత్తనాలు అమ్మినవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కస్తాల గోపికృష్ణ హెచ్చరించారు. సోమవారం ఆయన ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సాగు సీజన్ ప్రారంభానికి ముందు నుంచే ముందస్తు జాగ్రత్త చర్యలుగా విత్తన కేంద్రాలను, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే చర్యలు తప్పవని, అలాంటి కంపెనీలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరి విత్తన రకంపై వ్యవసాయ అధికారులతో సర్టిఫికేషన్ తప్పనిసరని, వ్యవసాయ అధికారులు సర్టిఫికేషన్ లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన స్టాక్‌లు, లాట్‌లు, స్టాకు రిజిష్టర్లు, లైసెన్స్‌లు తదితర వాటిని పరిశీలించనున్నట్లు వివరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు.

## జర్నలిస్టుల పిల్లల చదువులకు రాయితీలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని వివిధ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల పరంగా తగిన రాయితీలు కల్పించాలని, ప్రైవేట్ యాజమాన్యాల ఇష్టారాజ్య దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయు) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ ఎదుట విలేకరులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలిమెల నాగయ్య, యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శి ఎండి అస్లం ల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సబ్ కలెక్టరేట్ ఆవరణలో జర్నలిస్టులు బైఠాయించి నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ డీఏఓ శ్రీనివాసశర్మ, మండల విద్యాశాఖాధికారి ధర్మానాయక్‌లను కలిసి జర్నలిస్టుల పిల్లల విద్యా సమస్యలపై సమగ్రమైన వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ విలేకరుల పిల్లలకు పాఠశాలల ఫీజులలో రాయితీలు కల్పించడం వల్ల వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. చాలా కాలంగా ఈ సమస్య పెండింగ్‌లో ఉన్నప్పటికీ స్థానిక అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుండి ఫీజు రాయితీల కొరకు స్పష్టమైన సర్క్యులర్ వెలువడే వరకు తాము శాంతియుత పద్ధతిలో పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ ప్రత్యేక కమిటీలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షులు బాలాజీ రావు, ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ జర్నలిస్టులు నామిరెడ్డి నరేందర్ రెడ్డి, ఖాజా నాజీముద్దిన్, సుమన్, కిషోర్, జిల్లా ప్రచార కార్యదర్శి కాతోజు నాగాచారి, అస్లం, బండ వేణుగోపాల్ రెడ్డి, అశోక్, రాచకొండ రమేష్, సునీల్ చౌదరి, కిషోర్, శీను, కాట్రాజ్ అశోక్, నక్క శ్రీను, వెంకన్న, హరీష్ బాబు, తోఫిక్, కట్ట బాబు, షేక్ వసీం, రాయించు నగేష్ పాల్గొన్నారు.

## 9న చెన్నకేశవస్వామి కల్యాణం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యాద్గార్‌పల్లి గ్రామంలోని పురాతన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో నవమ వార్షిక కల్యాణ మహోత్సవం ఈ నెల 9వ తేదీన ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, దాత చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే కార్యక్రమంలో పంచామృతాభిషేకం, హోమాలు, పూర్ణాహుతి అనంతరం ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం జరిగే ఉత్సవమూర్తుల ఊరేగింపు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పనుంది. ఆలయ అభివృద్ధికి దాతలు, గ్రామస్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ మహోత్సవం యాద్గార్‌పల్లి గ్రామంలో భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలవనుందని తెలిపారు.



## సర్ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వద్దు


**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** సర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దని తహశీల్దార్ సంతోష్ కిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ ఫామ్‌ను ఎలా భర్తీ చేయాలి, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, తొలగింపులపై క్షుణ్ణంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటుహక్కు అనేది ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఈ ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో జరగాలని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ అసిస్టెంట్ శైలజ, వీరబాబు, బిఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ప్రిన్సిపాల్‌గా నీరజ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా పూసం నీరజ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఖమ్మం జిల్లా ఇల్లందులో కెమిస్ట్రి లెక్చరర్‌గా, ఎఫ్‌ఎసి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల పదోన్నతి పొందారు. ఈనేపథ్యంలో సోమవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా పి.వెంకటరమణ నుండి ఆమె ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిరజకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిజెఎల్ ఎ అధ్యక్షులు, ఇంటర్ విద్య జాక్ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంఘం గౌరవధ్యక్షులు కెఎస్ రామారావు, ప్రిన్సిపాల్ సంఘం నాయకులు శేషబాబు, శంకర్, జిజెఎల్‌ఎ నాయకులు ఖుర్షిద్ అహ్మద్, ప్రమీల, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పవన్, గీతాబాయి, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ధనమ్మ, నవీన్, జ్యోతి, మద్దిమడుగు సైదుల, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## శివాలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శ్రీ శంభు లింగేశ్వర స్వామి వారి దేవాలయాన్ని సోమవారం సందర్భంగా సూర్యాపేట జిల్లా జడ్జి లక్ష్మి శారధ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగిళ్ల శంభిరెడ్డి, మాజీ ఉత్సవ కమిటి చైర్మన్ పెండ్లి లచ్చయ్య వారిని పూర్ణకుంభంతో ఆహ్వానించి వారిని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్, ధనుంజయ శర్మలు వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎస్ఐగా యాదవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐగా యాదవేందర్ రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్‌పి కె. నరసింహ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన సాయిరాంను సిసిఎస్‌కు బదిలీ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది సాయిరాంకు ఘనంగా వీడ్కోలు పలికారు.




## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన బొడ్డు నాగరాజు, జనిగల సౌజన్యలకు సోమవారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ గొప్ప వరం అని రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తూ వారికి అభివృద్ధి సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్మడి దశరథగుప్త, మాజీ ఎంపిపి వేణుగోపాల్ యాదవ్, ఆంజనేయులు, స్వామి లబ్దిదారులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా పాండు బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించిన జె.జగన్ బదిలీ కావడంతో నూతన ఎస్సైగా సీత పాండు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పోలీస్ సేవలు అందిస్తానని తెలిపారు. చట్టం ముందు అందరు సమానమేనని శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ మహిళల భద్రత, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఆయన కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది నూతన ఎస్సై సీత పాండు ను కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఉపాధ్యాయులకు టిఫిన్స్ , మధ్యాహ్న భోజనం వద్దు

### పిఆర్సి, డిఏలు ఇవ్వండి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని వివిధ పాఠశాలలలో ఎస్సీ,ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు బోయరాములు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టిఫిన్ మధ్యాహ్న భోజనం వద్దు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి, డీఎలను వెంటనే అమలు చేయాలని, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు ఐఐటియుకేషన్ చేయుటకు సంబంధించిన జీవో 342 అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో 26659 రద్దు చేయాలని కోరుతూ అలాగే పదోన్నతులలో అడ్డంకిగా ఉన్న అడక్వసీ అనే పదాన్ని రద్దుచేసి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కోశాధికారి దుబ్బాక యాదయ్య, చౌటుప్పల మండల అధ్యక్షుడు జనపాల కిషన్, మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు హనుమంతు, కత్తుల ఉదయ, ఉపాధ్యాయులు ఉమాదేవి, కిష్టయ్య, సునీత, యాదగిరి, గణేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఉచిత విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** పత్తి ఉత్పాదకత పెంచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పత్తి ఉత్పాదకత మిషన్ కార్యక్రమంలో భాగంగా సంస్థాన్ నారాయణపురం రైతు వేదికలో రైతులకు ఉచిత విత్తనాలు మండల వ్యవసాయ అధికారిని బి పూజ పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 455 ఎకరాలకు డెమో ప్లాట్స్ వేయుటకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేయడం జరిగిందని తెలిపారు. రైతుల సాగు వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడును సాధించేందుకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలను ఇప్పటికే వేసిన పత్తి పంట సాల మధ్యలో వేయకుండా ప్రత్యేకంగా ఒక ఎకరం విస్తీర్ణంలో మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులు ప్రభుత్వం సూచించిన పంట రకాలైన సాగు చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, సర్పంచులు తోటకూరి శంకర్, మాజీ సర్పంచులు బచ్చన బోయిన దేవేందర్, కోన్ రెడ్డి నరసింహ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**విశ్వవిద్యాలయ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి సూచించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో సోమవారం అనుబంధ కళాశాలల వ్యాయామ అధ్యాపకుల సమావేశం నిర్వహించారు.విద్యార్థులకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడంతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు.యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే ఐసీటీ,ఐయూటీ క్రీడా సెలక్షన్సను విజయవంతం చేయాలని,విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ హరీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పోర్ట్స్ బోర్డ్ సభ్యులు,కళాశాలల శారీరక విద్యా సంచాలకులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.




## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ రేవనపల్లికి చెందిన వ్యవసాయదారుడు తండ్రి సురకంటి సాయి రెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ అన్యాయాన్ని నిరసిస్తూ పోచంపల్లి పోలీస్ స్టేషన్ ముందు బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ ఆధ్వర్యంలో సోమవారం బిజెపి నాయకులు ధర్నా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన పోలీసులు బిజెపి నాయకులు సురకంటి రంగారెడ్డి తండ్రి కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా చులకనగా చూసారని, నిందితులు యథేచ్ఛగా తిరుగుతున్నా అరెస్టు చేయడం లేదని పోలీసులపై మండిపడ్డారు.ఎస్ఐ నిర్లక్ష్య వైఖరి వహించడం సబబు కాదన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏల చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మాయ దశరథ, కర్నాటి ధనుంజయ, పాశం భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, ఎనం శివ కుమార్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ బిక్షం గౌడ్, చిక్క కృష్ణ పాల్గొన్నారు.

## 11,12 తేదీల్లో సిఐటియు జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/నకిరేకల్:** ఈ నెల 11,12 తేదీల్లో నకిరేకల్‌లో నిర్వహించనున్న సీఐటీయూ నల్లగొండ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలో శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈతరగతుల్లో వివిధ రంగాల కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి,కార్మికులను చైతన్యపరచడంతో పాటు ఐక్య పరుస్తూ భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు,జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు,నకిరేకల్ మండల కన్వీనర్ వంటెపాక వెంకటేశ్వర్లు,జిల్లా కమిటీ సభ్యులు ఆదిమళ్ల సుధీర్,బొల్లెపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల పరిసరాలను వెంటనే శుభ్రం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో విపరీతంగా గడ్డి పెరగడంతో విషపురుగులు సంచరిస్తూ విద్యార్థినుల ప్రాణాలకు ముప్పుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు హాస్టల్ ప్రిన్సిపల్ మరియు ఆర్‌సిఓ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.ఈ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించి సమస్యను వివరించినట్లు తెలిపారు.



## ఉచితంగా పత్తి విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతువేదికలో మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ ( కాపాస్ కాంతి ) పథకం లో భాగంగా మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సి రెడ్డి, అజింపేట, వేల్దేవి గ్రామా సర్పంచులు కన్నెబోయిన లింగస్వామి, రాచకొండ రమేష్ సబ్సిడీ కింద మండలం లోని రైతులకి 225 ఎకరాలకు డెమో చేయుటకు మరియు ఉత్పాదకతను పెంచుటకు ఉచిత పత్తి విత్తనాల ప్యాకెట్లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి పాండురంగాచారి, ఏఈఓలు అక్షర, రవితేజ , అనూష మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## భవాని సిల్క్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా సుదర్శన్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/మునుగోడు :**మండల భవాని సిల్క్ సహకార ఉత్పత్తి విక్రయ సంఘానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సిలువేరు సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.9మంది డైరెక్టర్లతో కూడిన సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా,9మంది కంటే తక్కువ నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి జి.శరత్ కుమార్ నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ సిల్క్ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, సభ్యులందరి సహకారంతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తానని అన్నారు.

## మాదవి విధుల నిర్వహణ

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన మొక్క సత్యనారాయణ, ఉపేంద్రమ్మల కుమార్తె మాదవి ఇటీవల నర్సింగ్ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. దీంతో ఆమె భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టింగ్ పొంది విధులలో చేరినట్లు తెలిపారు. నిరంతర శ్రమ పట్టుదలే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామా నికి చెందిన యువతకు మాదవి ఆదర్శంగా నిలిచిందని అభినందించారు.

# పోషకాల పండు అల్లనేరేడు

### ఆరోగ్యానికి మేలు

### మూడు నెలల సీజన్..భారీ గిరాకీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : నల్లని బ్రౌన్ రంగులో మెరిసే అల్లనేరేడు పళ్లు మే,జూన్,జూలై నెలల్లోనే కనిపిస్తాయి.తీపి,ఒగరు కలిసిన రుచితో ఏడాదికి రెండు నెలల పాటు మాత్రమే లభించే ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.ముఖ్యంగా మధుమేహ రోగులకు ఇది ప్రకృతి ప్రసాదించిన వరంగా ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తోపుడు బండ్లు,రైతు బజార్, ప్రకాశం బజార్ వద్ద ఈ పళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**పోషకాలు, ఔషధ విలువలు ఎన్నో**

ఈ చెట్టు పండ్లు, ఆకులు, బెరడు, గింజ అన్నీ ఔషధంగా ఉపయోగపడతాయి. అజీర్తి, అతిసారం, రక్తహీనత, ఆస్తమా, చర్మ వ్యాధులకు ఉపయోగపడతాయని వైద్యులు అంటున్నారు. పండులో యాంటీ బయోటిక్ గుణాలు ఉన్నాయి. గింజల పొడిని నీటిలో కలుపుకొని తాగితే షుగర్, బీపీ నియంత్రణలో ఉంటుందని ఆయుర్వేద డాక్టర్ ఆరూరి బాల నరసయ్య తెలిపారు.

**కిలో 400 నుంచి 500 వరకు**

హైదరాబాద్,వరంగల్,జనగామ ప్రాంతాల నుంచి తెచ్చి నల్లగొండలో కిలో 400 నుంచి 500 రూపాయలకు విక్రయిస్తున్నారు.రోజుకు 40 నుంచి 50 కిలోల వరకు అమ్ముడవుతోందని వ్యాపారులు చెప్పారు.సీజన్ మరో 15 నుంచి 20 రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు.

**వ్యాపారులు,వినియోగదారులు ఏమంటున్నారు?**



సంవత్సరానికి ఒకసారి వచ్చే ఈ పండ్లకు మంచి డిమాండ్ ఉంది. షుగర్,రక్తహీనత వంటి సమస్యలకు ఉపయోగపడతాయని ప్రజలు ఆసక్తిగా కొంటున్నారు ప్రకృతి సహజంగా పండిన ఈపండ్లపై ఎలాంటి కెమికల్ స్ప్రే చేయకుండా విక్రయించాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ప్రతి సంవత్సరం అల్లనేరేడు పళ్లను విక్రయిస్తా: వ్యాపారి మహమ్మద్ ఎజాజ్**

సంవత్సరానికి ఒకసారి రెండు నెలలు మాత్రమే సీజన్‌లో వచ్చే అల్లనేరేడు పళ్లకు మంచి ఆదరణ ఉంటుందని నల్లగొండ పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి మహమ్మద్ ఎజాజ్ తెలిపారు.ఈ పండ్లు నెల నుంచి 25 రోజుల వరకు అందుబాటులో ఉంటాయని,సీజన్‌లో హైదరాబాద్, వరంగల్, జనగామ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నామని చెప్పారు.షుగర్ వ్యాధిగ్రస్తులకు,రక్తహీనత,పుండ్లు,విరోచనాలు వంటి సమస్యలను తగ్గించడంలో అల్లనేరేడు ఉపయోగపడుతుందని,అందుకే ఈ సీజన్‌లో ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

**ప్రతి సీజన్‌లో తప్పక తింటా: విశ్వనాథుల లెనిన్**

అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చిందంటే నేను తప్పక కొనుగోలు చేసి తింటానని పానగల్‌కు చెందిన విశ్వనాథుల లెనిన్ తెలిపారు. దీనివల్ల అనారోగ్యం నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు.ఈ పండ్ల సీజన్ కేవలం రెండు నెలలే ఉంటుందని, ఇది ప్రకృతి ఇచ్చిన ప్రసాదమని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులకు ఈ పండు ఎంతో ఉపయోగపడుతుందని,ప్రతి ఒక్కరూ వీటిని తిని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.



## నిఘా వ్యవస్థ ఏర్పాటు

**ప్రజాపక్షం/మర్రిగూడ**: మండలంలోని కుదభక్షుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిబండ తాండలో సోమవారం సిసిటివి నిఘా కెమెరాలను స్థానిక ఎస్ఐ రాంబాబు ప్రారంభించారు.గ్రామ ప్రజల భద్రత మరియు రక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ గ్రామస్తులు,యువత,ప్రజా ప్రతినిధులకు సిసిటివి కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.కెమెరాల ప్రత్యక్ష ప్రసారాన్ని గ్రామస్తులకు చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.అనిల్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ ప్రక్రియ పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ** : ఎస్ఆర్ 2026 ప్రక్రియలో భాగంగా మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామ పంచాయతీలోని 241, 243 పోలింగ్ కేంద్రాలను సోమవారం తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్యతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బిఎల్ఓలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి తిరిగి అందజేయాలని గ్రామస్తులకు సూచించారు.

## జన్మదిన వేడుకల్లో గొంగిడి

**ప్రజాపక్షం/గుండాల**; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మచ్చ చెన్నారెడ్డి మనువరాలి హన్సిక జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ జన్మదిన వేడుకలకు ఆలేరు మాజీ ఎంఎల్ఏ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి





**ప్రజాపక్షం/నాంపల్లి** : జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల రూపంలో 75 శాతం రాయితీ కల్పించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకన్నకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రచార కార్యదర్శి ఊరుపాక వెంకటయ్య మాట్లాడుతూ రాత్రింబగళ్లు ప్రజల సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం శ్రమిస్తున్న జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు రవీందర్ గాదెపాక,కటకం సైదులు,దామెర ఉత్తరయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ** : ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఉత్తర్వులు జారీ చేయాలని ప్రింట్ మీడియా జర్నలిస్టులు కోషాధికారి ఆకుల రఘుమయ్య డిమాండ్ చేశారు.టియుడబ్ల్యూజే(ఐజేయు) కమిటీ ఆదేశాల మేరకు సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 75 ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముద్దం శీను,కుక్కడపు ముత్యాలు గౌడ్,మహేశ్వరం సతీష్,కొంపల్లి నాగరాజు గౌడ్, లప్పంగి మహేందర్,పగడాల ఆంజనేయులు,పగిళ్ల లింగస్వామి, కే.వెంకటేష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండలంలోని పసునూరు గ్రామంలో జలజీవన్ మిషన్ మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాశిమల్ల గోవర్ధన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా రక్షిత మంచినీటిని అందించడమే జలజీవన్ మిషన్ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.నీటిని వృధా చేయరాదని,ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంచాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### వనమహోత్సవం...

**ప్రజాపక్షం/మర్రిగూడ** : రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లపంగి నర్సింహ, ఉప సర్పంచ్ పొగాకు సైదులు, పంచాయతీ కార్యదర్శి సలీవోజు యాదయ్య, వార్డు సభ్యులు పగిల్ల శంకర్ పాల్గొన్నారు.



## శుభాకాంక్షలు చిన్నారులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు, సామాజికవేత్త, పాస్టర్ ధీరావత్ హన్యానాయక్, రమాదేవి దంపతుల 43 వ సంవత్సర పెళ్లిరోజు సందర్భంగా ఆశ్రమ చిన్నారులు, విద్యావేత్తలు, దాతలు సోమవారం ఆశీర్వదించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హన్యానాయక్ మాట్లాడుతూ తమ వివాహం జరిగి 43 సంవత్సరాలు పూర్తయి 44 సంవత్సరంలోకి వెళ్లడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డేవిడ్, సుధారాణి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని కాటేపల్లికి చెందిన గంధమల్ల పాండు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు స్వామి వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.14 వేలు ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. చిన్న వయసులోనే ఉజ్వల భవిష్యత్తు ఉన్న పాండు మృత చెందడం విషాదకరం అని అతని కుటుంబా నికి ఎల్లవేళల అండగా ఉంటామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వల్లాల మహేష్ యాదవ్, భూరెడ్డి జనమేజయ రెడ్డి ,పచ్చిమట్ల హరికృష్ణ, దాసం నాగరాజు, వల్లాల నరేష్ యాదవ్, బండ రాజు, గంధమల్ల శ్రీనివాస్, సాయి కిరణ్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : భారతదేశ తొలి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమల, సరఫరాల శాఖ మంత్రిగా సేవలందించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, బిజెపి టీచర్స్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి, రాష్ట్ర నాయకులు బూర మల్సూర్ గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాది అన్నారు. దేశ సమగ్రత, జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. నాయకులు చల్లమల్ల నర్సింహ, పరుశురామ్, రవివర్మ, దాసరి వెంకన్న యా దవ్, కోడి లింగయ్య, తన్నీరు వాసుదేవ్, రామచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి బిఎల్‌ఓలకు అందజేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** మునుగోడు నియెజకవర్గంలో జూన్ 24 నుండి బిఎల్ఓలు ఓటర్లకు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పూరించి తిరిగి సంబంధిత బిఎల్ఓలకు అందజేయాలని చండూరు ఆర్డీఓ మునుగోడు నియోజకవర్గం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వని ఓటర్ల ఓట్లు ఓటరు జాబితా నుండి తొలిగించబడుతాయని తెలిపారు.

# అలుపెరుగని యోధుడు బాబు జగ్జీవన్‌రామ్







**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,మాజీ జెడ్ పిటిసి వంగూరి లక్ష్మయ్య అన్నారు.సోమవారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎన్‌జి కళాశాల ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ శంకర్,మామిడి కార్తీక్,పెరిక వినాయక రాజ్,పెరిక అంజయ్య,పెరిక చిట్టి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బాబు జగ్జీవన్ రామ్ దేనని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు అన్నారు. సోమవారం భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ఇంచార్జి యాతాకుల రాజన్న, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బొజ్జ సైదులు, దళిత సంఘాల నాయకులు బొల్లెద్దు వినయ్, వల్లపట్ల దయానంద్, మల్లేష్, ఉపేందర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నడిగూడెం:** మాజీ ఉప ప్రధాని, దళిత బహుజన ఉద్యమనేత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) మాదిగ, ఎంపవర్మెంట్ పౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరతపమ్మ సుధీర్, ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ లు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దున్న శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, ఏపూరి పర్వతాలు, గంటెపంగు నాగరాజు, దున్న సుధాకర్, పాతకొట్ల శ్రీను పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామంలో సోమవారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దళిత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహనికి సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు, కొండెటి కోటయ్య, చిప్పల సుధాకర్,మేళ్ల చెర్వు చిన్నబిక్షం, జక్రయ్య, కృష్ణ, బూర వీరాబాబు, సైదులు, గరిడేపల్లి సతీష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోదాడ:** దళిత బహుజనుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, కౌన్సిలర్ చీమ నరేష్ లు పేర్కొన్నారు. సోమవారం కోదాడలో జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్ల సుందర్‌బాబు, అబుబాకర్ కరీముల్లా బాబా, పిట్టల భాగ్యమ్మ, ఉపేందర్‌గౌడ్, గొర్రె రాజేష్, జాని, గోపాలరావు, వెంకటరావు, పుల్లారావు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** దేశ నిర్మాణ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కెఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో రాజ్యాంగ పరిషత్ సభ్యులు శ్యాంప్రసాద్ ముఖర్జి జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన గ్రామాల అభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేముల వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో అధ్యాపకులు పిచ్చిరెడ్డి, యాదగిరి, బలభీమ్‌రావు, రమేష్, రామరాజు, రవి, కిరణ్, సతీష్, నాగరాజు, తిరుమలనర్సింహారెడ్డి, జ్యోతిలక్ష్మి , మమత పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత తొలి ఉప్రధాని, సమ సమాజ స్థాపనకై కృషి చేసిన కృషీవలుడు డా॥ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ భువనగిరి పట్టణంలోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు పొట్ట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోభారత మాజీ ఉప ప్రధాని, గొప్ప సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథిగా బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పసర్పంచ్ గోలీ నర్సింహ రెడ్డి, వార్డు సభ్యులు సోమ శివకుమార్, నెల్లుట్ల శ్రీశైలం, బుర్రి సుదర్శన్, ఆకుల రవీందర్, కాసుల మహేశ్ గౌడ్, పాశం మహిపాల్, దళిత రత్న అవార్డు గ్రహీత సోమారం శంకర్, మండల ఉపాధ్యక్షులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నకిరేకల్:** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం నకిరేకల్ పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎంఆర్పీఎస్ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద రవీందర్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పన్నాల రాఘవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న,సీపీఎం నాయకుడు ఏర్పుల తాజేశ్వర్,బీఎస్‌పినాయకుడు చెడిపల్లి కాశిరాం,కాంగ్రెస్ నాయకుడు చెట్టిపల్లి భాస్కర్,ఎంఈఎఫ్ నాయకుడు వంటల రామలింగం,కాటేపల్లి శ్రీరాములు,దుర్గం సైదులు తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని రాస్తారోకో

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలుస్తూ ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని, జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజుల్లో రాయితీ కల్పించే సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్‌లో జర్నలిస్టులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి (ఎంఈఓ) మేక నాగయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగాఆసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకు సతీష్,జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల సతీష్,జిల్లా నాయకుడు కందగట్ల శ్రీధర్ మాట్లాడుతూ సమాజం కోసం అహర్నిశలు శ్రమిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యతను జర్నలిస్టులు నిర్వర్తిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేయాలని,డీఈవో నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆసంఘం సివియర్ నాయకులు అలుగుబెల్లి శ్రీనివాసరెడ్డి,రేపాల రంగనాథ్,మండల అధ్యక్షుడు బెల్లి సాయి, మండల ప్రధాన కార్యదర్శి గడగోజు రవీంద్రచారి,ఉపాధ్యక్షుడు తూడి మోహన్,నరసింహ,వాన రాసినారాయణ,గోపి నిమ్మల సైదులు,నాగార్జునరెడ్డి,నాగరాజు,చందు, గోవర్ధన్ సలీం పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మునుగోడు:** జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఫీజు రాయితీ కల్పించడంలో విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు సంఘం పిలుపు మేరకు మునుగోడు మండల పత్రిక విలేకరులు సోమవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.అనంతరం మండల విద్యాధికారి మల్లేశంకు ఫీజు రాయితీ వెంటనే కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముదుపు శ్యాంసుందర్ రెడ్డి,జాజుల స్వామి గౌడ్,దొమ్మాటి కృష్ణ,నెల్లికంటి శంకర్,జీడిమడ్ల నరేష్, లింగస్వామి,మార్నేని ప్రభాకర్,పెరమండ్ల ప్రమోద్,దుబ్బ భాస్కర్,దుబ్బ అనిల్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వేములపల్లి :** జర్నలిస్టుల కుటుంబ సభ్యుల పిల్లలకు పాఠశాల విద్య కోసం ఫీజు రాయితీ సర్కులర్ జారీ చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షుడు షేక్ మౌలాలి తహశీల్దార్ హేమలత,మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్‌లకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లల విద్య కోసం ప్రభుత్వం ప్రకటించిన ఫీజు రాయితీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని, సంబంధిత సర్కులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు షేక్ రసూల్,జిల్లా కమిటీ సభ్యుడు దైద వెంకటేశ్వర్లు,మండల కమిటీ ఉపాధ్యక్షుడు వంగాల వెంకటేష్,ప్రధాన కార్యదర్శి తండు వెంకన్న గౌడ్,కోశాధికారి ముండ్ల కళ్యాణ్ యాదవ్,జర్నలిస్టు షేక్ అబ్జాల్,ముండ్ల లింగయ్య యాదవ్,కట్టా ఆనంతారెడ్డి,గాదె వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలోని రావువారిగూడెం,రావులపెంట,కామేపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సూపర్వైజర్ పరిమి రజిని తెలిపారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ఆయా గ్రామాలకు చెందిన మహిళలు ఈపోస్టులకు అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మీసేవ కేంద్రాల ద్వారాదరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలలు,కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రవీందర్ డిమాండ్ చేశారు.పాఠశాలలు,కళాశాలల్లో నిర్దిష్ట పుస్తకాలనే కొనాలని ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొన్ని యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరచాలని కోరారు. జిల్లా నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

